
భక్తులతో కిటకిటలాడిన హత్యరాల పుణ్యక్షేత్రం

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- వేకువజాము నుంచే పోటెత్తిన భక్తులు
- అఖండ మల్లేశ్వరుడిగా దర్శనమిచ్చిన మల్లన్న
- హత్యరాలకు పోటెత్తిన భక్తులు
- నిత్యపూజ కోనలో భక్తుల కిటకిట


మల్లయ్యకొండపైన స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లలో బారులు తీరిన భక్తులు


నిత్యపూజస్వామికి ప్రత్యేక పూజలు

హరోం హర.. శంభో శంకర..


ప్రత్యేక అలంకరణలో రాయచోటి అఘోరలింగేశ్వరుడు

తంబళ్లపల్లె, మార్చి 8: హర హర మహదేవ.. శంభో శంకర.. అంటూ భక్తుల శివనామ స్మరణతో శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. శుక్రవారం శివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు వేల సంఖ్యలో బారులు తీరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడంతో కొండ మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివరాత్రి పర్వదినాన మల్లికార్జునస్వామి అఖండ మల్లేశ్వరుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రా రెడ్డి కాలినడకన మల్లయ్యకొండ ఎక్కి స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ఈశ్వరప్ప శుక్రవారం స్వామి వారిని అఖండ మల్లేశ్వరునిగా అలంకరించి ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ పాలకమండలి చైర్మన్ కేఆర్ మల్‌రెడ్డి, ఈవో రమణ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ శివ పార్వతుల కళ్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వ హించారు. భక్తులు స్వామి వారి కళ్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. మల్లయ్యకొండ పైన ఆలయం వద్ద వేల మంది భక్తులు శివనామస్మరణలు చేసుకుంటూ భక్తి గీతాలు ఆలపిస్తూ జాగరణ చేశారు. మల్లయ్యకొండ కింద మద్దాభక్తుని బావి వద్ద మల్లికార్జునస్వామి సేవా సమితి (అన్నదాన ట్రస్ట్) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు.

భక్తులతో కిటకిటలాడిన హత్యరాల

రాజంపేట టౌన్, మార్చి 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన హత్యరాల భక్తులతో కిటకిట లాండింది. శివరాత్రి సందర్భంగా అన్నమయ్య, కడప, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హత్యరాల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. బాహుదానదిలో స్నానాలు ఆచరించి త్రేతేశ్వరస్వామికి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. బాహుదానదిలో స్నానమాచరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, అతికారి కృష్ణ ఆధ్వర్యంలో రాజంపేట, కడప ప్రాంతాలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. రాజంపేట డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిత్యపూజస్వామి కోనలో క్యూ కట్టిన భక్తులు

సిద్ధవటం, మార్చి 8: లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజస్వామి క్షేత్రం భక్తులతో కిటకిట లాడింది. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి నిత్యపూజస్వామిని దర్శించుకు న్నారు. సిద్ధవటం ఈద్గా మైదానం వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండు వద్దకు భక్తులు చేరుకొని అక్కడి నుంచి పంచలింగాల వరకు బస్సులో ప్రయాణించి.. పంచలింగాల గుడి వద్ద నుంచి కోనలో కాలినడక నిత్యపూజస్వామి కోన చేరుకున్నారు. అక్కడ జలపాతంలో స్నానం చేసి.. నిత్యపూజస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం శివపార్వ తుల కల్యాణం చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో పా ల్గొన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ పంపిణీ చేశారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిద్దేశ్వరస్వామికి రుద్రాభిషేకం

కలకడ, ఫిబ్రవరి 8: కలకడ శ్రీకామాక్షి సమేతా సిద్దేశ్వర స్వామి ఆలయంలో మహా శివ రాత్రిని పురష్కరించుకొని శుక్రవారం రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచేకాక కడప జిల్లా నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించు కున్నారు. పలువురు భక్తులు మొక్కుబడులో భాగంగా తలనీలాలు సమర్పించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది.


భక్తులతో కిక్కిరిసిపోయిన పంచలింగాల కోన

వీరభద్రాలయంలో ఘనంగా రుద్రహోమం

రాయచోటిటౌన్, మార్చి 8: దక్షిణ కాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయాల యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్ర వారం ఉదయం రుద్రహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలం రెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రో చ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వ హించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలకరించి గజవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిం చారు. ఈ సందర్భంగా టీడీపీ ధర్మ ప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన చెక్కభజన కార్యక్రమం భక్తులను అలరిం చింది. అలాగే రాత్రికి భద్రకాళీ సమేత వీరభద్రుడు పురుష మృగ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టు కుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా రూపానందరెడ్డి



రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, మార్చి 8: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా ముక్కా రూపానంద రెడ్డిని నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నా యుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో ముక్కా రూపా నందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్య కర్తలను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని కోలు కోలేని విధంగా దెబ్బతీసి.. టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని తెలిపారు. ప్రజలు ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా.. చంద్రబాబును సీఎం చేద్దామా అని ఎదురు చూస్తున్నారన్నారు.

ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె గ్రామంలో పుట్టిన రూపానందరెడ్డి అంచలంచెలుగా వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతూ ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఈయన వై.ఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉంటూ.. గత ఎన్నికల వరకు ప్రస్తుత వైసీపీ అధినేత వైఎస్ జగన్ సూచనల మేరకు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా పనిచేశారు. గత రెండేళ్లుగా పార్టీలో తగిన ప్రాధాన్యత లేకపోవడంతో ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. నాటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుంటూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసే దిశగా ముందుకు సాగుతున్నారు. కాగా, ముక్కా రూపానందరెడ్డి అభిమానులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆనందంతో సంబరాలు చేసుకున్నారు.

వైసీపీ వర్గీయుల దాడిలో టీడీపీ నేతలకు తీవ్రగాయాలు


గాయపడిన మురళీమోహన్‌రెడ్డి, నవీన్, గంగిరెడ్డి

పీలేరు, మార్చి 8: పీలేరు మండలం తలపుల పంచాయతీ ముంతావాండ్ల పల్లెకు చెందిన టీడీపీ నేత మురళీ మోహన్ రెడ్డి, అతని కుటుంబ సభ్యులపై వైసీపీ వర్గీయులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తల పుల పంచాయతీలో మురళీ మోహన్‌రెడ్డి టీడీపీలో క్రియాశీల కంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులైన కె.రాజశేఖర్‌రెడ్డి, కె.రమణ, కె.హరినాథ్‌లు శుక్రవారం సాయంత్రం రెడ్డివారి పల్లె సమీపంలోని తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి తిరిగొస్తుండగా దాడి చేశారని మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు. దాడిని అడ్డు కోబోయిన తన తండ్రి రమణా రెడ్డి(75), బాబాయి గంగిరెడ్డి(70), కుమారుడు నవీన్ (17)లపై కొడ వళ్లు, కర్రలతో దాడి చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి విషయాన్ని తెలుసుకున్న పీలేరు పట్టణ టీడీపీ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వారిని పరామర్శించారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.


ప్రస్తుతం మామిడి చెట్లకు వస్తున్న పూత

మామిడి రైతుపై ప్రకృతి పోటు

- పూతరాని తోటలు.. తెగుళ్లతో పిందెపట్టని వైనం
- ఈ ఏడాది 30 శాతం లోపే దిగుబడి
- తోటల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- నష్టాల బాటలో అన్నదాతలు

సంబేపల్లె, మార్చి 8: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది మామిడి రైతులపై ప్రకృతి పోటు తప్పలేదు. జిల్లా వ్యాప్తంగా 31 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాలతో సుమారు 40 వేల ఎకరాలు సాగులో ఉంది. ఇందులో 20 నుంచి 30 శాతం కూడా ఇప్పటికీ పూత రాలేదు. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో మామిడి పూత రావడం జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెల వచ్చినా ఇప్పటికీ తోటల్లో పూత కనిపించడం లేదు. ఒకవేళ పూత తెగుళ్లు పట్టిపీడిస్తున్నాయి. మందులు పిచికారి చేసినా తెగుళ్లు తగ్గడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. మామిడి తోపులు కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా అడ్వాన్సులు వదిలేసి తోటల వైపు కన్నెత్తి చూడడం లేదు.


తెగుళ్లతో మగ్గిపోయిన పూత

నష్టాలు తప్ప ఆదాయం లేదు

గత ఐదేళ్లుగా నష్టాలు తప్ప మామిడిలో ఆదాయం కనిపించలేదని రైతులు వాపోతున్నారు. రెండేళ్లు కరోనా ప్రభావంతో దిగుబడి బాగా వచ్చినా ఎగుమతులు లేక నష్టపోతే.. గత ఏడాది అకాల వర్షాలు గాలి, వానలతో బంక తెగులు వచ్చి తీవ్రంగా నష్టపోయినట్లు తెలియజేశారు. ఈ ఏడాది ఎక్కడ చూసినా తెగుళ్ల ప్రభావంతో నవంబర్, డిసెంబర్ నెలలో రావా ల్సిన మామిడి పూత ఫిబ్రవరి, మార్చిలో కూడా వస్తున్నట్లు రైతులు చెబుతు న్నారు. జల్లు పూతలతో పిందె పట్టక దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా ఈ ఏడాది 30 శాతంలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలతో సతమతం

మామిడి రైతులకు సస్యరక్షణ ఖర్చులు పెరిగాయి. నవంబర్, డిసెంబర్ నుంచి తెగుళ్ల నివారణ కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మార్కెట్‌లో లభించే మందులు తెచ్చి పిచికారి చేస్తు న్నారు. సాధారణంగా గతంలో పూత రాక మునుపు ఒకసారి.. పూత వచ్చిన తర్వాత పింజ దశలో మరోసారి పిచికారి చేసేవారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా పొగ మంచుతో మామిడిలో తెగుళ్ల పోవడం లేదు. దీంతో కొంత మంది రైతులు నాలుగు నుంచి ఐదు సార్లు మందులు పిచికారి చేసినట్లు చెబుతున్నారు. ఒక ట్యాంకర్ (3 వేల లీటర్ల)కు మందు పిచికారి చేసేందుకు నాలుగు వేల రూపాయలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. పది ఎకరాల తోటకు రూ.23 నుంచి 25 వేల వరకు ఒకసారి మందులు పిచికారి చేసేందుకు ఖర్చు వస్తోందంటు న్నారు. ఇలా మూడు, నాలుగు సార్లు పిచికారి చేయాల్సి రావడంతో రైతులకు తడిసి మోపె డవుతోంది.


సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతులు

పూత సక్రమంగా రాలేదు



- నాగభూషణం, రైతు, మాధంవాండ్లపల్లె, సంబేపల్లె

నాకు మూడున్నర ఎకరా మామిడి తోపు ఉంది. ఈ ఏడాది పూత సక్రమంగా రాలేదు. పూత వచ్చినా బంక తెగులుతో పింజ పట్టలేదు. ఫిబ్రవరి, మార్చిలో కూడా పూత వస్తోంది. ఈ పూత నిలబడే పరిస్థితి లేదు. ఈ ఏడాది నష్టాలు తప్పవనిపిస్తోంది.

ఐదేళ్లుగా నష్టపోతూనే ఉన్నాం



- ఖాదర్‌వలి, మామిడి వ్యాపారి, సంబేపల్లె

ఐదేళ్లుగా నష్టపోతూనే ఉన్నాం. ప్రతి ఏడాది 40 నుంచి 50 లక్షల రూపాయలు మామిడితోపులు కొనడం.. ప్రతి ఏడాది వాతావరణ పరిస్థితులతో నష్టపోతూనే ఉన్నాం. రెండేళ్ల కరోనాతో నష్టపోయాం. గత ఏడాది గాలి, వానలతో కాయలపై బంక తెగులు వచ్చి నష్టపోయాం. ఈ ఏడాది తెగుళ్లతో పూత, పింజ పట్టలేదు. 35 లక్షలకు మామిడి తోపులు కొన్నాను. కొన్ని తోటల్లో పూత రాలేదు. తెగుళ్లకు కొట్టిన మందుల డబ్బులు కూడా వస్తాయన్న నమ్మకం లేదు.

వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు

- సురేశ్, ఉద్యానశాఖ అధికారి

ఈ ఏడాది మామిడి రైతులకు వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. నవంబరు, డిసెంబరు నెలల్లో రావాల్సిన పూత రాలేదు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నా తెగుళ్ల నివారణ కాలేదు. వాతావరణ పరిస్థితులతో ఈ ఏడాది 30 శాతం లోపు దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది.


దేవపట్ల మిట్ట వద్ద ఇప్పటికీ పూత రాని మామిడి తోపు



అత్యాశతో అధోగతి

కడప నగరంలోని చిన్నచౌకు, మృత్యుంజయకుంట, ఓంశాంతినగర్, శంకరాపురం, అక్కాయపల్లె, ఐటీఐ సర్కిల్, రవీంద్రనగర్.. ఇలా ప్రతి ప్రాంతంలో వీధికొకరు చీటీలు నిర్వహిస్తున్నారు. కడపతో పాటు పలు ప్రాంతాల్లో అనుమతి లేని చీటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిలో తరచూ ఎక్కడో ఓ చోట నిర్వాహకులు రాత్రికి రాత్రే పరారవుతున్నారు. అత్యాశతో చీటీలు వేసి, అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి.. ఆ డబ్బులు తిరిగి రాక.. బాధితులు లబోదిబోమంటున్నారు. తరచూ ఇలాంటి వ్యవహారాలు ఎక్కడో ఓచోట వెలుగులోకి వస్తూనే ఉన్నా.. జనం ప్రైవేటు చీటీలు వేస్తుండటం విశేషం.

- ప్రైవేటు చీటీలతో జేబులకు చిల్లు
- భారీగా డబ్బులు కూడగట్టుకుని టోపీ పెడుతున్న చీటీల నిర్వాహకులు
- తరచూ మోసపోతూనే ఉన్నా.. కొందరిలో మారని తీరు
- పోలీసుస్టేషన్ల గడప తొక్కుతున్న బాధితులు
- ఆధారాల్లేక చర్యలు తీసుకోలేని పోలీసులు
- లబోదిబోమంటున్న బాధితులు

కడప(క్రైం), మార్చి 8: జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల నెల చీటీలు, వారం చీటీలు, రోజు చీటీలు కూడా నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల నిర్వాహకులు అత్యాశకు పోయి వడ్డీ వ్యాపారం చేస్తూ సభ్యుల డబ్బును ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఎగరగొడుతున్నారు. చీటీల పేరుతో వేలు, లక్షలు దాటి కోట్ల రూపాయలు కూడా కోల్పోయిన వారున్నారు. అంతా అయిపోయాక పోలీసుస్టేషన్‌కు రావడం, ఎంతో కొంత ఇప్పించమని పోలీసులను వేడుకోవడం కడప నగరంలో తరచూ జరుగుతోంది.

కొన్ని ఉదాహరణలు

● కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి చీటీలు నిర్వహిస్తూ వస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అందరికీ బాగా నమ్మకంగా ఉన్నాడు. దీంతో చీటీలతో పాటు చాలామంది అత్యాశతో ఆయనకు అధిక వడ్డీలకు డబ్బు ఇచ్చారు. దాదాపు రూ.20 కోట్ల మేర డబ్బులు వసూలు చేసుకుని పరారయ్యాడు.

● ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళ బంగారు కుదువపెట్టి లోన్ల రూపంలో వారికి డబ్బులు ఇవ్వడంతో పాటు.. అధిక వడ్డీ ఇస్తానంటూ వారి వద్ద నుంచి ఆ డబ్బులు తీసుకునేది. తొలుత అందరికీ డబ్బులు చెల్లించేది. అందరికీ నమ్మకం ఏర్పడ్డాక భారీ మొత్తంలో వసూలు చేసి పరారయింది. డబ్బులు ఇచ్చిన వారికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసుస్టేషన్ చేరుకుని బాధితులు లబోదిబోమన్నారు.

● గతంలో కడప నగరంలోని అక్కాయపల్లెలో భార్య భర్త చీటీలు వేసి కోట్లు వసూళ్లు చేసి ఆపై బోర్డు తిప్పి పరారయ్యారు. డబ్బు కట్టినట్లుగా బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఆ వ్యవహారంపై పలువురు తాలుకా పోలీసులను ఆశ్రయించడంతో ఆ దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేసి ఇటీవల నిర్వాహకుడిని అరెస్టు చేశారు.

● కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ రెండు నెలల క్రితం చీటీలు వేసి భారీ ఎత్తున సభ్యుల నుంచి వసూళ్లు చేసుకుని పరారైంది. ఇదే ప్రాంతంలో మరో వ్యక్తి కోట్ల రూపాయల్లో చీటీలు వేసి చివరికి ఐపీ దాఖలు చేసి పరారయ్యాడు. కడప నగరంతో పాటు పలు చోట్ల ఇలాంటి ఘటనలు రోజూ కనబడుతూనే ఉన్నాయి. బాధితుల వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు తలలు పట్టుకుంటున్నారు.

చట్టపరిధిలో భద్రత

చట్టపరిధిలో అనుమతి పొందిన చీటీల్లో డబ్బులు కట్టే సభ్యులకు కచ్చితంగా ఆర్థికపరమైన భద్రత ఉంటుంది. వీటిని నిర్వహించాలనుకుంటే తొలుత రిజిస్టరు కార్యాలయంలో పేరును రిజిస్టరు చేస్తారు. ఎంత చీటీ వేస్తున్నారో ఆ మేరకు బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ పత్రాలను చూపిస్తే సదరు కార్యాలయంలో నెంబరు వేసేందుకు అధికారులు అనుమతి ఇస్తారు. ఇలాంటి చీటీ సంస్థల్లో సభ్యులకు మాత్రమే భద్రత ఉంటుంది. అలా కాదని ప్రైవేటు వ్యక్తుల వద్ద చీటీలు వేస్తే భద్రత ఉండదు. చీటీల ద్వారా అధిక మొత్తం వసూళ్లు చేసుకుని పరారు కావడంతో పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది. ఆధారాలు లేకోవడంతో పోలీసులు ఏం చేయలేని పరిస్థితి. ప్రైవేటు చీటీలు, గ్యారంటీ లేని వడ్డీకి ఆశపడి ఎవ్వరూ మోసపోవద్దని పోలీసులు కోరుతున్నారు.

అత్యాశతో నమ్మి మోసపోవద్దు

- షరీఫ్, డీఎస్పీ, కడప

చాలా మంది అత్యాశతో ప్రైవేటు చీటీలు వేసి డబ్బులు పోగొట్టుకుంటూ లబోదిబోమంటున్నారు. ప్రతిసారి ప్రైవేటు చీటీలతో ఇలాంటి మోసాలు జరుగుతున్నా జనంలో మార్పు రావడం లేదు. వీరికి అవగాహన కల్పించినప్పటికీ చీటీ నిర్వాహకులపై ఉన్న నమ్మకం తొలుత వారిచ్చే వడ్డీలతో నమ్మి మోసపోతున్నారు. చట్టపరిధిలో ఉండేదైతే న్యాయం జరుగుతుంది.



చీటీ డబ్బులతో పారిపోయిన వ్యక్తిపై కడప డీఎస్పీకి ఫిర్యాదు చేసి విలపిస్తున్న బాధిత మహిళ (ఫైల్‌ఫొటో)

కొనసాగిన వైసీపీ చీరల పంపిణీ


పల్లంపాడులో చీరలు పంపిణీ చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పెనగలూరు, మార్చి 8 : మండలంలో ఓటర్లకు వైసీపీ నాయకులు తలపెట్టిన చీరల పంపిణీ కార్యక్రమం రెండవ రోజైన శుక్రవారం కొనసాగింది. పల్లంపాడు గ్రామంలో వైసీపీ కార్యకర్తలు మహిళా ఓటర్లకు చీరల పంపిణీ చేశారు. అయితే అధిష్ఠానం నుంచి రేషన్ కార్డుకు ఒక చీర చొప్పున పంపించారని.. కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకుంటే ఎలాగని కొంత మంది వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు చీరలను పక్కన పెట్టినట్లు సమాచారం. ఒక్కో ఇంటి లో ఇద్దరు ముగ్గురు మహిళా ఓటర్లు ఉన్నపుడు రేషన్‌కార్డుకు ఒక చీర చొప్పున ఇస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని పక్కన పెట్టినట్లు సమాచారం.

రాజోలి నుంచి కుందూకు నీరు


కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

రాజుపాలెం, మార్చి 8 : వేసవికాలం దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు కుందూనదికి నీరందిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట వద్ద నుంచి 200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. 20 రోజులుగా చుక్కనీరు లేక ఎడారిని తలపించిన కుందూలో ఈ నీరు ప్రవహిస్తున్నా గుంతలు నిండుతూ రావడం ద్వారా కడపకు చేరేందుకు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. కాగా.. నదికి ఆనుకుని ఉన్న బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుందని, మూగజీవాలకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడి.. 12 మంది అరెస్టు

కొండాపురం, మార్చి 8: మండలంలోని కొండాపురం, పొట్టిపాడు గ్రామాలవద్ద పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. కొండాపురం రైల్వేస్టేషన్ వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురి నుంచి రూ.19,250, పొట్టిపాడు గ్రామం వద్ద .పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మంది నుంచి రూ.1,38,000 స్వాధీనపరుచుకున్నారు. .వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

చిన్నమండెం, మార్చి 8: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామంలో ఏడుగురు జూదరులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. దిగువగొట్టివీడు గ్రామ సమీపాన జూదమాడుతున్నారన్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.11,530 సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



బ్రహ్మంగారిమఠం, మార్చి 8: అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విద్యాసాగర్ వివరాల మేరకు కొత్తూరు గ్రామవాసి ఆకుల ఫణీంద్ర (36) శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం అప్పులు ఎక్కువ చేశాడని, అవి తీర్చలేనేమోనని మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి రాములమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ఉత్తుత్తి సమావేశాలతో ఉపయోగం లేదు'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 8 : ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర మంత్రులు ఉత్తుత్తి సమావేశాలు ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 4 శాతం డీఏ ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉద్యోగులకు దక్కాల్సిన హక్కులను కాలరాస్తూ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో పండుగ సమయాల్లో డీఏ వచ్చేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి పండుగకు ఉద్యోగులు డీఏ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారే కానీ ప్రభుత్వం మాత్రం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకులతో ప్రతిసారి సమావేశాలకు పిలిచి ఉద్యోగులకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కరించకుండానే ముగిస్తున్నారని పేర్కొన్నారు. పీఆర్సీ, డీఏ, సీపీఎస్ రద్దు, ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉపాధ్యాయుల పదోన్నతులు, జేఎల్ పదోన్నతులు, ఆదర్శ పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు వంటివి ఎన్నో ఉన్నప్పటికీ వాటిలో ఒక్కటి కూడా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు పెడచెవిన పెట్టిన ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించుకునే రోజులు త్వరలోనే రానున్నాయని ఆయన హెచ్చరించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


అటవీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఫారెస్ట్ రేంజర్ కళావతి

సిద్దవటం, మార్చి8: మహాశివరాత్రి సందర్భంగా లంకమల అభయారణ్యంలోని నిత్యపూజ కోనలో విధినిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం ఫారెస్ట్ రేంజర్ కళావతి సూచించారు. వణ్యప్రాణులను దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ వంటి పదార్థాలు వేయనివ్వకుండా చూడాలని, పంచలింగాల వద్ద అపరిశుభ్రత కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిత్యపూజ కోనకు వెళ్లే రహదారిలోని వద్ద చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, మత్తుపదార్థాలను అరికట్టాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు పాల్గొన్నారు.

రాజంపేట పట్టణంలో పోలీసుల కవాతు


రాజంపేట పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

రాజంపేట టౌన్, మార్చి8: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రజల్లో అభద్రతాభావాన్ని పోగొట్టేందుకు శుక్రవారం రాజంపేట పట్టణంలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. డీఎస్పీ చైతన్య సూచన మేరకు రాజంపేట పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పోలీస్ శాఖ, పారా మిలిటరీ బలగాలతో పట్టణంలోని మన్నూరు పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి కూచివారిపల్లె వరకు కవాతు చేశారు. రాష్ట్రంలో అప్పటికే 30 యాక్ట్ అమల్లో ఉందని సభలు, ర్యాలీలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, మంజునాథరెడ్డి, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మజాతరకు 500 మందితో బందోబస్తు

- ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 8: మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ జాతకు 500 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన గంగమ్మజాతర జరిగే చోటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11, 12 తేదీల్లో జరిగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులను, ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని వీరికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో జూదాలు, అక్రమ మద్యం విక్రయాలు, దొంగతనాలు జరిగితే వెంటనే పోలీసు కస్టడీకి తీసుకొని అరెస్టు చేస్తామన్నారు. సోమవారం రాత్రి కుంకుమ బండ్లు, చాందినీబండ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని జాతర జరిగే చోటుకు నాలుగువైపులా వాహనాల స్టాండ్‌లు ఏర్పాటుచేయాలని సీఐ గంగనాబాబు, ఎస్‌ఐ విష్ణువర్ధన్‌లకు సూచించారు. మర్రిమాను క్రాసురోడ్డు, లక్కిరెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు, నల్లగుట్టపల్లె క్రాస్‌రోడ్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రవీంద్రరాజు ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, కమిటీ సభ్యులు, పూజారులు రామయ్య, గంగాధర తదితరులు పాల్గొన్నారు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

రూ.లక్షలు మట్టిపాలు

- పులివెందుల బస్‌టర్మినల్‌లో ..
- నాలుగు షాపింగ్ గదుల తొలగింపు
- ఏడాదిన్నర అవుతున్నా.. ఒక్క దుకాణమూ రాలేదు
- అభాసుపాలవుతామని గదులతొలగింపు..?

పులివెందుల రూరల్, మార్చి 8: ముందస్తు ప్రణాళిక, సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అధికారుల తప్పిదం మరోసారి బట్టబయలైంది. పులివెందులలో మరోసారి లక్షల రూపాయలు వృథా అవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా పట్టణంలో వైఎస్సార్ బస్‌టర్మినల్ నిర్మించారు. అందులో విశాల బస్‌స్టేషన్, ప్లాట్‌ఫామ్‌లు, గ్యారేజీ, వాహనాల పార్కింగ్, షాపింగ్ గదులు సుందరంగా తీర్చిదిద్దారు. దాదాపు రూ.22.50 కోట్లతో నిర్మించిన ఈ బస్‌టర్మినల్‌ను 2022 డిసెంబరులో ముఖ్యమంత్రి ప్రారంభించారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన కొద్ది నెలల తర్వాత బస్సుల రాకపోకలు ప్రారంభించారు. బస్‌టర్మినల్‌లో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌లో షాపింగ్ గదులు, ఏసీ వసతితో కూడిన గదులు, ప్రయాణికులు వేచి ఉండే ఆవరణం, టాయిలెట్లు నిర్మించారు. రాకపోకలు ప్రారంభించిన కొద్దిరోజులకే పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక పర్యాటక ఎక్సలెన్స్ అవార్డ్-2023 దక్కించుకుంది. కాగా ప్రయాణికులు కూర్చునేందుకు ఇప్పటికే విశాల ఆవరణం ఉంది. దాదాపు రెండు వందల మంది ప్రయాణికులు కూర్చునేందుకు వీలున్న బస్టాప్‌లో నాలుగు షాపింగ్ గదులు తొలగించి మరింత ఆవరణం ఏర్పాటు చేస్తున్నారు. ఇదో అంతుపట్టని విషయం. ఏదిఏమైనా పులివెందులలో లక్షల రూపాయలు వృథా అని మరోసారి రుజువవుతోందని అక్కడి ప్రయాణికులు, స్థానిక ప్రజలు అంటున్నారు.


షాపింగ్ గదులను తొలగిస్తున్న దృశ్యం

ఒక్క దుకాణం కూడా లేదు..

బస్‌టర్మినల్ ప్రారంభించి దాదాపు ఒకటిన్నర సంవత్సరం అవతుఉన్నా.. ఇంతవరకు టర్మినల్‌లో ఒక్క దుకాణం కూడా ఏర్పాటు కాలేదు. ఇన్నాళ్లయినా ఖాళీగా ఉన్న ఈ గదులను అలాగే ఉంచుకొని అభాసు పాలయ్యేకంటే తొలగించడమే మేలు అనుకున్నారేమో అధికారులు, నాలుగు గదులను తొలగిస్తున్నారు. ఈ విషయంపై పులివెందుల ఆర్టీసీ డీఎం రామకృష్ణను వివరణ కోరగా ప్రయాణికులు కూర్చునేందుకు మరింత వీలు కల్పించేందుకు గదులను తొలగిస్తున్నట్లు తెలిపారు.


పులివెందుల బస్‌టర్మినల్‌లో ఖాళీగా ఉన్న ఆవరణ


పులివెందుల బస్‌టర్మినల్‌లో తొలగనున్న షాపింగ్ గదులు


పాతరాయచోటి శివాలయంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు


సుండుపల్లెలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


వీరబల్లి: శివపార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


సింగనమల గురునాదీశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శంభో.. శివ శంభో..

శివనామ స్మరణతో మారుమ్రోగిన శివాలయాలు ● పోటెత్తిన భక్తులు


సుండుపల్లెలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచోటిటౌన్, మార్చి 8: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి పాత రాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉదయం హోమాలు, దాక్షాయణి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా సూర్యకిరణాలు అగస్త్యేశ్వర స్వామి పాదాలను తాకాయి. పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ ఉమామహేశ్వరస్వామి, చెన్నముక్కపల్లె సమీపంలోని

గాలివీడు: వెలిగల్లు ప్రాజెక్టుకు దిగువన పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శివాలయానికి వివిధ మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. గండిమడుగు ఒడ్డునున్న శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అరవీడు, తూముకుంట, ఎగువగొట్టివీడు, నూలివీడు, కొర్లకుంట తదితర గ్రామాల్లోని శివాలయాలకు ప్రజలు వేకువజామునే చేరుకొని పూజలు నిర్వహించారు.

రామాపురం: హసనాపురంలోని శివాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. వేదపండితులు వారికి స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో పప్పిరెడ్డి మహేశ్‌రెడ్డి దంపతులు, లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్‌బాబు దంపతులు, రామాపురం ఎస్ఐ ఎస్ఎల్వీ ప్రసాద్‌రెడ్డి దంపతులు ప్రాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుధీప్‌రెడ్డి, పప్పిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణ, హరినాథరెడ్డి, ఆంజనేయరెడ్డి, అమర, కోఆప్షన్ హజీమ్, నాగార్జున పాల్గొన్నారు. మండలంలోని గువ్వలచెరువు ఘాట్‌పై, కడవకూటివాండ్లపల్లె, కల్పనాయుని చెరువు, నల్లగుట్టపల్లె, కుమ్మరపల్లె, చిట్లూరు, కంభారాయునిగుట్ట తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేసి శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని భుజంగేశ్వరస్వామి, కుంటకోన, మల్లికార్జున భ్రమరాంబిక తదితర శివాలయాల్లో శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. తలకోన, గుండాలకోన తదితర క్షేత్రాలకు భక్తులు తరలి వెళ్లారు. భుజంగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలోని రాఘవరాజపురం వద్ద ఉన్న భ్రమరాంబికా మల్లికార్జు స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కల్యాణోత్సవంలో టీడీపీ యువ నేత ముక్కా సాయి వికాస్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: వై.కోట ప్రాంతంలో గుండాలకోనేశ్వరుడు, పెద్దఓరంపాడు గౌరీ సిద్దేశ్వరాలయం, బొమ్మవరం కమ్మపల్లె గోకర్ణేశ్వరాలయం తదితర ఆలయాల్లో భక్తులు భారీ ఎత్తున పూజలు చేశారు.

చిట్వేలి: మండల కేంద్రంలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, పాత చిట్వేలిలో భద్రకాళి సమేత వీరభద్రాలయాల్లో ధ్వజారోహణ, నందిపూజ కంకణధారణ, నవగ్రహ శాంతి, చండీహోమం నిర్వహించారు. శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మహా నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం చేశారు. లింగోద్భవ సమయంలో మహాన్యాస ఏకవార రుద్రాభిషేకం చేశరు. మూలరోడ్డు, రాజుకుంట, అనుంపల్లె, మార్లోపల్లె, కె.ఎస్. అగ్రహారం, నగిరిపాడు ఈశ్వరీదేవి మటం నక్కలపల్లె తదితర గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అన్ని శివాలయాల్లో అన్నదానాలు, అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు.

సుండుపల్లె: మండలంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయం, తిమ్మసముద్రం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, చింతలయ్యగారిపలెతో పాటు పలు శివాలయాల్లో శుక్రవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. శివపార్వతులను ఊరేగించారు.

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని సర్వమంగళ దేవి, రామలింగేశ్వరస్వామి అనంతపురం గంగమ్మజాతర, లక్కిరెడ్డిపల్లె, దప్పేపల్లెల్లో పార్వతిపరమేశ్వరులు పూజలందుకున్నారు. రాత్రి హరికథ కాలక్షేపం, భజనలు చేశారు. పంచామృతం, ప్రసాదాలు పంచిపెట్టారు.

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో మంగళగౌరీ సమేత అమర లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దాదాపు 2500 మందికి అన్నదానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లింగోద్భవ సమయంలో అమరిలంగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

సంబేపల్లె: మోటకట్లలోని వెంకటశివసాయి ఆలయం, సంబేపల్లె పశుపతినాధ ఆలయం, చిన్నజంగంపల్లె, చంద్రమౌళీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో అగ్నిగుండం వేశారు. భజన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


హత్యరాల క్షేత్రంలో అన్నదానం చేస్తున్న రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ

వీరబల్లి: వంగిమళ్ల పంచాయతీ దుగ్గనపల్లిలో ఉన్న శివాలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అనంతరం అన్నదానం చేశారు.

పుల్లంపేట: స్థానిక మెయిన్ రోడ్డులోని మారెమ్మ, పర్వతవర్ధినిదేవి శాంతి లింగేశ్వరస్వామి, పుత్తనవారిపల్లె కేతావాండ్లపల్లె, రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద ఉన్న శివాలయాల్లో పూజలు నిర్వహించి అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా శివపార్వతులు ప్రత్యేకంగా అలంకరించి అబిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

ఒంటిమిట్ట: మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం, కొత్త మాధవరంలోని మృకుండ మల్లేశ్వరస్వామి ఆలయం, పెన్న పేరూరులోని పెన్నానదిలో వెలసిన శివాలయంలో వేకువజాము నుంచి శివలింగంకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు మహిళలు పిల్లలు భక్తులు పెద్దఎత్తున శివాలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. మృకుండ మల్లేశ్వర ఆలయం కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద పెద్దఎత్తున భక్తుల కోసం దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పెనగలూరు: సింగనమలలోని గురునాదీశ్వర ఆలయంలో కంబాలకుంట బీసీ కాలనీకి చెందిన పుచ్చకాయల రాఘవేంద్ర,పార్వతి దంపతులు కళ్యాణోత్సవం, అన్నదానం చేశారు. జెట్టివారిపల్లె, నారాయణనెల్లూరు, పెనగలూరులోని ఆలయాల్లో కళ్యాణోత్సవం, అన్నదానం చేశారు.

రాజంపేట: మండల పరిధిలోని వెంకటరాజంపేట కనకదుర్గ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేశారు.

నందలూరు: మండల కేంద్రంలోని ఉల్లంఘేశ్వర ఆయలం, మొండేశ్వర ఆలయం, నారాయణరాజుపేట శివాలయం, చింతకాయలపల్లె, టంగుటూరు, కుమ్మరపల్లె, పాటూరు కన్యాశ్రమంతో పాటు ఇతర శివాలయాలలో భక్తులు విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందుకున్నారు. ప్రతి ఆలయంలోనూ అన్నదానం చేశారు ఆర్.ఎస్ రోడ్డులోని అవధూత కాలప్ప స్వామి విగ్రహ పునఃప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


రాజంపేట:కళ్యాణం అనంతరం ఆశీనులైన శివపార్వతులు


రైల్వేకోడూరు భుజంగేశ్వరస్వామి ఆలయంలో కిక్కిరిసిన భక్తులు


మాధవరంలో కొలువైన అమరలింగేశ్వరస్వామి


ఒంటిమిట్టలో పూజలందుకున్న శివుడు


అవధూత కాలప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అభిమాని కుటుంబానికి పరామర్శ

ఓబులవారిపల్లె, మార్చి 8 : మండలంలోని తురకపల్లెలో ముక్కారూపానందరెడ్డి అభిమాని సయ్యద్ ఇస్మాయిల్ కుమార్తె షేక్ మహబూబ్‌జాన్‌కు మోకాలు శస్త్ర చికిత్స జరగడంతో ముక్కా సాయివికాస్‌రెడ్డి పరామర్శించారు. సయ్యద్ బీసీఆర్ మస్తాన్, షేక్ రసూల్, షేక్ నబీ, షేక్ ఖలీల్, నయమత్తు, మస్తాన్, షేక్ మహబూబ్ బాషా, ముబారక్, అమానుల్లా, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, పోలసాని కిరణ్ కుమార్, అమృతాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మొల్ల అకాడమీ నెలకొల్పాలి

బద్వేలు, మార్చి 8: జిల్లాలో మహా కవయిత్రి మొల్ల మాంబ పేరుతో తెలుగు అకాడమి నెలకొల్పాలని మొల్ల సాహితీపీఠ వ్యవస్థాపక అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. మొల్ల సప్త శతాబ్ది ఉత్సవాలలో భాగంగా రెండో రోజు బద్వేలు పెన్షనర్స్ భవనంలో శుక్రవారం సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కమలమ్మ మాట్లాడుతూ గోపవరానికి మొల్ల పేరు పెట్టేందుకు, ఆమె పేరుతో కడపలో అకాడమీ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. అనంతరం సాహిత్య, ఆధ్యాత్మిక, విద్యరంగాలలో సమాజ సేవ చేసిన పులివెందులకు చెందిన డాక్టర్ నాగేంద్రమ్మకు మొల్ల సాహితీ పురస్కారం, నగదు, జ్ఞాపిక అందజేవారు. ఈ కార్యక్రమంలో వైవీయూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు కొండపల్లి చిన్న సుబ్బారావు, మొల్ల సాహితీపీఠ ప్రధాన కార్యదర్శి మనోజ్, పెన్షనర్స్ సంఘ బద్వేలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షి రెడ్డి, కత్తి బ్రహ్మయ్య, గంగన్న, దంతవైద్యులు క్రిష్ణ, తదితరులు పాల్గొని అనంతరం మాజీ ఎమ్మెల్యే కమలమ్మను సత్కరించారు.

సృష్టికి మూలమైన మహిళలను గౌరవిద్దాం

● టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 8: ఈ సృష్టికి మూలమైన మహిళలను గౌరవిద్దామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గీత బీడీ యజమాని నసీబ్‌జాన్, కౌన్సిలర్ సర్‌తాజ్‌బేగం, పరిదాఖానం, ముంతాజ్‌కు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. మహిళలకు భూ హక్కు, మహిళా భద్రత లాంటి ఎన్నో చట్టాలతో పాటు మహిళలకు డ్వాక్రా రుణాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీలోనే మొదలయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు తమ విలువైన ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకే ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించడంతో పాటు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు చాలక్, ఖాదర్‌మోదీన్, అమీర్ ఇలాహి, చికెన్ ఖాదర్‌బాషా, సోహెబ్, మహమ్మద్, అష్రప్, అహ్మద్‌బాషా, ముబారక్‌బాషా, మయాన సయ్యద్ సాబ్, బాషాజాన్, అంజద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంటే...

మురుగుకాలువలతో ఇబ్బందులు పడుతున్నామని పట్టణంలోని 5వ వార్డు మహిళలు, ప్రజలు మండిపల్లి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన మా ట్లాడుతూ కాలువలపై పైకప్పు కూడా లేదని, దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే మాత్రం రాయచోటిని అభివృద్ధి చేసేశానంటూ గొప్పలు చెబుతున్నాడని మండిపడ్డారు. ఓట్లు అడిగేందుకు వచ్చినపుడు శ్రీకాంత్‌రెడ్డిని నిలదీయాలని తెలిపారు. జనావాసాలు లేని చోట కమిషన్లు దండుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేసి చేతులు దులుపుకున్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటేసి తను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.


కొత్తపల్లిలో మైనార్టీ మహిళలను సన్మానిస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

వీరగంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ఒంటిమిట్ట, మార్చి 8: సాలాబాదు పంచాయతీ మల కాటపల్లె వీర గంగమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణ పతి పూజ, స్వస్తి వాచనము, పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజ, మహా నివేదన, దశవిధ హార తులు, తీర్థప్రసాద వితరణ చేశారు. శనివారం ప్రధాన కలశ ఆవాహనం, లక్ష్మీ గణపతి , నవగ్రహ, రుద్ర హో మాలు, పూర్ణాహుతి ఉంటాయని నిర్వాహకులు తెలి పారు.. దాతల సహకారంతో అన్నదానం చేశారు.

టీడీపీ ఇన్‌చార్జిగా ముక్కా రూపానందరెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న పంతగాని, బొక్కసం సునీల్

రైల్వేకోడూరు, మార్చి 8: టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జిగా ముక్కా రూపానందరెడ్డిని నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో ముక్కా రూపానంద రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ అందరిని కలుపుకుని పని చేసి, అభ్యర్థిని గెలిపిస్తామని, రైల్వేకోడూరులో వైసీపీ కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తామని తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ. జనసేన నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ముందుకు పోతామన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో రైల్వేకోడూరు దే ప్రథమ గెలుపు వస్తుందన్నారు. ఎక్కడ లేని విధంగా వినూత్న రీతిలో ప్రచారాలు ఉంటాయన్నారు. సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీలో విభేదాలు లేకుండా చేస్తామన్నారు. కాగా, ఈ సమాచారం ముందుగానే తెలుసుకున్న రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్‌రాయల్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలసిశుభాకాంక్షలు తెలిపారు.

దళిత కార్యకర్తల హర్షం

పెనగలూరు : ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డిని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా నియమించడంతో మండలంలోని పలువురు దళిత కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మండల ఎస్సీ సెల్ నాయకులు ఎస్.సురేష్, ఈరి విజయభాస్కర్, హరిబాబు, రమణ, లింగం నరేష్, శ్రీరాములు, నరసింహులు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల సంబరాలు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

చిట్వేలి: రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా ముక్కా రూపానందరెడ్డిని నియమించడంతో చిట్వేలి టీడీపీ నేత కాకర్ల నాగార్జున ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కొత్త బస్టాండులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా పేలుస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు పర్యాయాలుగా ఓటమిని చవిచూస్తున్న కోడూరు తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తేవడానికి రూపానందరెడ్డి శాయశక్తులా కృషి చేస్తాడన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, మన్నూరు సత్యనారాయణ, పుల్లంపేట నారాయణ నాయుడు, మాచిన రవీంద్ర, వెంకటేశ్వర్లు, శివశంకర్, సుబ్బరాయుడు, దినేష్, ధనుంజయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మండిపల్లి సతీమణి ప్రచారం


ఎన్నికల ప్రచారంలో మండిపల్లి సతీమణి హరితరెడ్డి, తల్లి సుశీలమ్మ

చిన్నమండెం, మార్చి 8: మండలంలోని పడమటికోన గ్రామంలో గురువారం రాత్రి రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరితరెడ్డి, తల్లి సుశీలమ్మ, పడమటికోన పరిధిలో ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించా లని ఓటర్లకు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అరాచక వైసీపీ ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాన్ని ప్రజలకు వివరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని వారు ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయినులు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని విశ్వభారతి ప్రధానోపాధ్యాయుడు రఘునాథరాజు పిలుపునిచ్చారు .ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, మాజీ ఐపీఎస్ కిరణ్‌బేడీ సాధించిన విజయాలను గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామచంద్రయ్య, రవీంద్ర, గంగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు

శాంతికి మూలం మహిళలే..


సన్మానం అందుకున్న మహిళా పశువైద్య సిబ్బంది

చిట్వేలి: సమాజంలో శాంతి నెలకొనడానికి మహిళలే కీలక పాత్ర పోషిస్తున్నారని చిట్వేలి ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు కె.డి.ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం మహిళా సిబ్బందికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏడీ కేడీ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు శాంతికాముకులు కాబట్టి సమాజంలో శాంతిని నెలకొల్పడానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. మగవారి సహకారం ఉంటే మహిళలు ఏదైనా సాధిం చగలరన్నారు. చిట్వేలి ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో మెరుగైన సేవలందిస్తున్న పశువైద్యులు వేదవతి, భువనేశ్వరి, తేజశ్విలను ఆయన అభినందించారు. ఈ కార్యక్ర మంలో లోకేష్ నాయుడు, గోపాలమిత్ర నరసింహులు, 1962 పైలెట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేయడంపై హర్షం

రాజంపేట టౌన్, మార్చి 8 : సుధామూర్తిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేయడంపై రాజంపేట పార్లమెంటు బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణ వర్మ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సుధామూర్తి ఒక సంఘ సేవకురాలుగా, రచయిత్రి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ప్రజారోగ్య విభాగాలలో కీలక పాత్ర పోషిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ అభివృద్ధితోపాటు విపత్తుల సమయంలో సహాయసహకారాలు అందించారన్నారు. ప్రజలతో మమేకమై ప్రజలతో అత్యంత అప్యాయంగా ఉండే సుధామూర్తిని రాష్ట్రపతి ద్రౌపతి రాజ్యసభకు నామినేట్ చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన వెలువరించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలి

● పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేయొద్దు ● చంద్రబాబు ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం ● టీడీపీ సీనియర్ నేత కస్తూరి విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, మార్చి 8: టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలని, పార్టీకి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఎలాంటి కార్యక్రమాలను చేయవద్దని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ రైల్వేకోడూరు సీనియర్ నేత కస్తూరి విశ్వనాథ నాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో కట్టా నారాయణయ్య నాయుడు అనంతరం చంద్రబాబు నాయుడు తనను పిలిపించి నాయకత్వం వహించాలని సూచించడంతో 2008 నుంచి టీడీపీ కార్యకర్తలకు అండగా నిలిచానన్నారు. తనను ఇన్‌చార్జిగా తీసివేసినంత మాత్రాన కార్యకర్తలు అసహనానికి గురికాకుండా ఉండాలన్నారు. పార్టీ అధిష్టానం తో చర్చించిన తర్వాత కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అంతవరకు కార్యకర్తలు ఎలాంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. ఏళ్ల తరబడి టీడీపీ జెండాను అంటిపెట్టుకుని కార్యకర్తలను, క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గం లో పార్టీని బలోపేతం చేశామని తెలిపారు. ఈ విషయం అధిష్టానానికి తెలుసన్నారు. రాష్ట్ర బీసీ నాయకుడు నాయుడోరి రమణయ్య మాట్లాడుతూ పార్టీ ఒక నిర్ణయం తీసుకుందని, ఒక వారం రోజుల పాటు కార్యకర్తలు, నాయకులు అందరూ సమన్వయం పాటించాలన్నారు. ప్రముఖ న్యాయవాది కేజేపీ రెడ్డయ్యనాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం కస్తూరి విశ్వనాథనాయుడు కష్టపడ్డారన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చారన్నారు. 1983 నుంచి తామంతా పార్టీ కోసం కష్టపడ్డామని తెలిపారు. అప్పటి నుంచి కేసులు పెట్టించుకున్నామని, కొందరు నాయకులు, కార్యకర్తలు ప్రాణాలను పోగొట్టుకున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అధిష్టానం నిర్ణయంపై వారం రోజులు వేచి ఉంటామని, తర్వాత శాంతియుతంగా కార్యాచరణఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, పట్టణ అధ్యక్షుడు పోకల మణి, మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడ్, నగిరిపాటి రేవతి, దుద్యాల అనితదీప్తి, మాజీ సర్పంచ్ ముక్కర శంకరయ్య, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలతో సమావేశమైన కస్తూరి విశ్వనాథనాయుడు

తిరుమలకు అలిపిరి నడక దారిలో అక్రమ దుకాణాలు వెలుస్తున్నాయి. ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు జారీ చేస్తుండగా దుకాణాల ఏర్పాటుకు ఓ బడా మంత్రి అనుచరులు రంగంలోకి దిగుతున్నారు.అసలే వ్యాపారాలు తగ్గాయని వాపోతున్న టీటీడీ లైసెన్సుడు దుకాణదారులు వీరిని అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఆందోళనలు, ఘర్షణలు తలెత్తుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కొద్దిరోజుల క్రితం కాలినడకమార్గంలో ఏర్పాటైన మరో దుకాణం



అలిపిరి నడక దారిలో అక్రమ షాపులు!

ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు

షాపుల ఏర్పాటుకు రంగంలోకి దిగిన బడా మంత్రి అనుచరులు

అడ్డుకుంటున్న టీటీడీ లైసెన్సుడ్ షాపుల నిర్వాహకులు

అలిపిరి మెట్ల దారిలో ఇప్పటి వరకూ టీటీడీ, దేవాదాయ శాఖలు మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నాయి.ఏడవ మైలు వద్ద మాత్రమే రెండు హోటళ్ళకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది.అద్దెలు విపరీతంగా పెరిగిపోవడం, దానికి తగిన వ్యాపారం జరగక ఆ రెండు హోటళ్ళూ ఎప్పుడో మూతపడ్డాయి. తర్వాత వేలం పాటల్లో ఎవరూ పాల్గొనకపోవడంతో హోటళ్ళు తెరుచుకోలేదు. అలాంటిది ఇపుడు ఏకంగా 30 షాపులకు అనుమతులు జారీ చేసింది. 2397వ మెట్టు వద్ద, చిట్టిక్కుడు వద్ద హిమాచల్ ప్రదేశ్ దుకాణం ఎదుట, 7వ మైలు ప్రాంతంలో 2400వ మెట్టు, 35వ మలుపులో 2403, 2410, 2415వ మెట్ల వద్ద, 2425వ మెట్టు, జింకలపార్కు సమీపాన 2542వ మెట్టు వద్ద, 2450వ మెట్టు వద్ద, జింకల పార్కు పరిధి 2550వ మెట్టు వద్ద, 2597వ మెట్టు, 2610వ మెట్టు, 2625వ మెట్టు, 2655వ మెట్టు, జింకల పార్కు మండప సమీపాన 2660 మెట్టు, 7వ మైలు ప్రాంతంలోని మండపం దగ్గర 2687వ మెట్టు, 2726వ మెట్టు, 2735వ మెట్టు, దొరసాని మండపం సమీపాన 2760వ మెట్టు, దొంగల మండపం సమీపాన 2796వ మెట్టు, అటవీ శాఖ సరిహద్దు లైను సమీపాన 2814వ మెట్టు, 2815వ మెట్టు, 2825వ మెట్టు, వ్యూ పాయింట్ సమీపాన 2832వ మెట్టు, ఎస్ఎస్ టెంపుల్ సమీపాన 2851, 2866వ మెట్ల వద్ద, కొత్త మండపం సమీపాన 2931వ మెట్టు, 7వ మైలు మండపం వద్ద రెండు, 7వ మైలు మ్యూజియం వద్ద ఒకటి చొప్పున మొత్తం 30 షాపులకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది.వీటితో కొందరు అర్ధరాత్రిళ్ళు స్తంభాలు నాటి ఇనుప రేకులతో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలు జింకలపార్కు, ఏడవ మైలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే అక్కడ టీటీడీ నుంచీ లైసెన్సు పొందిన వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరికి గతంలో తిరుమలలో లేపాక్షి నుంచీ సీఆర్వో వరకూ సబ్‌వేలో దుకాణాలుండేవి. అయితే అక్కడ వ్యాపారం జరగకపోవడంతో లక్కీ డిప్ ద్వారా అలిపిరి నడక దారిలో టీటీడీ దుకాణాలు కేటాయించింది . అయితే అక్కడ కూడా వ్యాపారాలు పెద్దగా సాగడం లేదు. కాలినడక భక్తులకు ఉచిత దర్శన టోకెన్లు అలిపిరిలోనే జారీ చేస్తుండడంతో నడక దారిలో వెళ్ళే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆ దారిలో వ్యాపారాలూ తగ్గాయి. దానికి తోడు చిన్నారులపై చిరుత పులులు దాడులు జరపడంతో అటవీ శాఖ అధికారులు తినుబండారాల విక్రయాలు వద్దని ఒత్తిడి పెంచారు. నడకదారి భక్తుల సంఖ్యా తగ్గింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో వున్న లైసెన్సుడు దుకాణదారులకు అటవీ శాఖ ద్వారా దొడ్డిదారిన షాపుల ఏర్పాటుకు కొందరు ప్రయత్నించడం కడుపు రగిలేలా చేస్తోంది. గత పదిరోజుల్లో పలు మార్లు కొత్త వ్యక్తులు దుకాణాల ఏర్పాటుకు యత్నించడం పాత దుకాణదారులు వాటిని కూల్చేయడం జరుగుతోంది. తాజాగా గురువారం కూడా కొత్తవ్యక్తులు కూలీలను పెట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా పాత వ్యాపారులు వాటిని అడ్డుకుని కూల్చివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడ ఘర్షణలు కూడా తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది.



ఏడవమైలు వద్ద నిర్మించిన దుకాణాన్ని తొలగిస్తున్న పాత దుకాణదారులు

ఎవరీ షాపులు దక్కించుకున్నవారు?

అలిపిరి నడక దారిలో 30 షాపులు ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుల పేరిట కేటాయింపులు జరిగాయి. బి.సుబ్రమణ్యం రెడ్డి, బి.శోభారాణి, ఎం.చంద్రబాబు, ఎస్.కృష్ణయ్య, ఎం.చంద్రశేఖర్, కె.వినోద్‌కుమార్, ఆర్.దీపిక, ఎస్.జయమ్మ, పి.హంస, ఎం.బాబు, సౌందర్య, జి.విజయ, సి.పద్మరాణి, ఎం.సుబ్రమణ్యం, ఆర్.నరసింహులు, వై.రాజశేఖర్, కె.లక్ష్మీదేవి, వై.హరిబాబు, సి.నాగరాజ, సి.మునిరాజ, బి.రేఖ, జి.చెంచెలక్ష్మి, వై.అనసూయమ్మ, వై.చండీప్రియ, వి.మదనమోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎం.పుష్పవేణి, వి.కృష్ణప్రసాద్‌రెడ్డి, డి.వెంకటేశులు పేర్లతో షాపులకు అనుమతులు జారీ అయ్యాయి. అసలు వీరంతా ఎవరో, ఎక్కడి వారో, వీరు ఎకో డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఎలా చేరారో పరిశీలించాల్సి వుంది. వీరంతా సదరు మంత్రి అనుచరులన్న ప్రచారం వుంది.వీరెవరికీ టీటీడీ నుంచీ అనుమతులు లేకపోయినా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూండడం గమనార్హం.

తాము వద్దన్న పనిని తామే చేస్తున్న అటవీశాఖ

అలిపిరి నడక దారిలో చిన్నారులపై చిరుత పులులు దాడులు చేయడంపై అధ్యయనం జరిపిన వైల్డ్ లైఫ్ అటవీ శాఖ ఉన్నతాధికారులు పలు అంశాలను గుర్తించారు. నడక దారి పొడవునా దుకాణాల్లో తిను బండారాలు విక్రయిస్తుంటారు. గతంలో జింకల పార్కు వున్నందున జింకలకు పాదచారులు తినుబండారాలు అలవాటు చేశారు. వాటికోసం జింకలు గుమిగూడేవి. అవి తినగా మిగిలే వ్యర్థాలను, నడక దారి భక్తులు పడేసే వ్యర్థాలు, దుకాణాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలు కూడా అక్కడే పోగుపడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం ఎలుగుబంట్లు రావడం మొదలైంది. మరోవైపు జింకల కోసం చిరుత పులులు మాటేయడానికి అలవాటు పడ్డాయి. కాలక్రమంలో జింకల పార్కు ఎత్తేసినా అలవాటు పడిపోయిన జింకలన్నీ ఆ ప్రాంతంలోనే ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఈ కారణంగానే చిరుతలు మెట్ల దారి వద్దకు వచ్చి మాటేయడం, అందుబాటులో చిన్నారులు కనిపించినపుడు దాడి చేసి లాక్కెళ్ళడం జరుగుతోంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఇదే అంశాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో తినుబండారాలు విక్రయించే దుకాణాలు ఎత్తివేయాలని సిఫారసు చేశారు.అదే అటవీ శాఖే ఇపుడు తినుబండారాల దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.పైగా 7వ మైలు ప్రాంతంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతివ్వడమే నిబంధనలకు విరుద్ధమన్న వాదన వినిపిస్తుండగా దానికి ఎంచుకున్న మార్గం కూడా మరింత అక్రమంగా కనిపిస్తోంది. తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి జి.సతీష్ దీనిపై గతేడాది నవంబరు 10వ తేదీన టీటీడీ ఈవోకు రాసిన లేఖలో అలిపిరి నడక దారిలోని 7వ మైలు ప్రాంతంలో ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తమ జీవనోపాధి కోసం తాత్కాలిక దుకాణాలు నడుపుతున్నారంటూ వాటి వివరాలు పేర్కొన్నారు. ఆ లేఖలోనే ఈ తాత్కాలిక దుకాణాలు 2018 నుంచీ నడుస్తున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి అధికారికంగా అయినా అనధికారికంగా అయినా నడక దారిలో అటవీ శాఖకు దుకాణాలే లేవని సమాచారం. 7వ మైలు వద్ద కేవలం రెండు దుకాణాలు మాత్రమే వుండేవని అవి కూడా పదిహేనేళ్ళ కిందట మూతపడ్డాయని సమాచారం. అయినా 2018 నుంచీ 30 తాత్కాలిక దుకాణాలు నడుస్తున్నాయని బాధ్యత కలిగిన జిల్లాస్థాయి అధికారి టీటీడీకి నివేదించడం విమర్శలకు దారి తీస్తోంది.

తెర వెనుక అసలు సంగతేమిటంటే...


టీటీడీ వ్యవహారాల్లో ముఖ్యంగా కొండపైన అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతల నడుమ ఆరు నెలలుగా ఆధిపత్య పోరు సాగుతోంది. తన అనుచరులకు మేలు చేసేలా దుకాణాల ఏర్పాటు వంటి వాటికి ఓ బడా మంత్రి చేస్తున్న సిఫారసులను టీటీడీ బుట్టదాఖలా చేస్తోందని సమాచారం. దర్శనాలు మినహా మిగిలిన పాలనా వ్యవహారాల్లో, లబ్ధి కలిగే ఏ అంశంలోనూ మంత్రి మాట చెల్లుబాటు కావడం లేదని వైసీపీ వర్గాల్లోనూ, టీటీడీ వర్గాల్లోనూ ప్రచారమవుతోంది. ఈ పరిణామాలతో ఆగ్రహించిన మంత్రి తనకున్న పలుకుబడి వినియోగించారని, దాంతో తిరుమలలో తన పరిధి కలిగివున్న ప్రభుత్వ అటవీ శాఖ తెర మీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక దారుల్లో కొన్ని ప్రాంతాలు, అలాగే కొండపైన పాపనాశనం వంటి చోట్ల కొన్ని ప్రాంతాలు ప్రభుత్వ అటవీ శాఖ పరిధిలో వున్నాయి. పాపనాశనం వద్ద ఆ శాఖ అనుమతితో ఎప్పటి నుంచో దుకాణాలు నడుస్తున్నాయి. గతంలో 7వ మైలు వద్ద రెండు దుకాణాలు ఆ శాఖ అనుమతితో నడిచేవి.వ్యాపారం జరగక మూతపడ్డాక వాటిని పునరుద్ధరించలేదు.ఈ నేపథ్యంలో మంత్రి ఒత్తిడితోనే అటవీ శాఖ అధికారులు 2018నుంచీ ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులైన 30మందికి తాత్కాలిక దుకాణాలు నడక దారిలో వున్నట్టు నిర్ధారించి టీటీడీ ఈవోకు లేఖ రాయడం వివాదాస్పదంగా మారుతోంది.

టీటీడీ భద్రత, పర్యవేక్షణ ఏమైందో శ్రీవారికెరుక!

టీటీడీ భద్రత, పర్యవేక్షణల్లో లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తాజాగా అలిపిరి నడక దారిలో కొత్త దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న యత్నాలే దానికి నిదర్శనం. అలిపిరి చెక్ పాయింట్ నుంచీ కొండపైదాకా ఇటు నడక దారిలోనూ, అటు ఘాట్ రోడ్లనోనూ, కొండపైనా ఎక్కడ చీమ చిటుక్కుమన్నా టీటీడీకి తెలియాలి. దానికి తగ్గ భద్రతా, నిఘా వ్యవస్థ దేవస్థానానికి వుంది. అయితే అలిపిరి నడక దారిలో పట్టపగలు, అలాగే అర్ధరాత్రిళ్ళు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతున్నా టీటీడీకి తెలియకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దుకాణాల ఏర్పాటుకు నిర్మాణ సామగ్రి టీటీడీ భద్రతా, నిఘా వ్యవస్థల కంట పడకుండా 7వ మైలు దాకా ఎలా చేరుతోందన్నది ప్రశ్న. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటే నిరంతరం నడక దారిపై నిఘా వేసి వుంచే విజిలెన్స్ యంత్రాంగానికి ఎందుకు తెలియడం లేదన్నది మరో ప్రశ్న. చివరికి అక్కడ పాత దుకాణదారులకు, కొత్తగా వస్తున్న వారికి గొడవలు జరుగుతున్నా కూడా టీటీడీ అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.మంత్రి ఒత్తిడితో సంబంధిత వ్యవస్థ చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని భావించాల్సివస్తోంది.

శంభో.. శివశంభో..!

● ముక్కంటి క్షేత్రంలో భక్తజనసందోహం



నంది, సింహ వాహనాలపై ఆదిదంపతుల విహారం

శ్రీకాళహస్తి, మార్చి 8: శ్రీకాళహస్తిలోని ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం భక్తులు పలుచగా కన్పించినా 11గంటలనుంచీ మొదలైన రద్దీ రాత్రి వరకూ కొనసాగింది.అప్పుడప్పుడూ తోపులాటలు కూడా జరిగాయి. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు.. పితృదేవతలకు తర్పణాలు జోరుగా సాగాయి. శివరాత్రిని పురస్కరించుకుని వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ తరువాత 3 గంటల నుంచీ భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకాలతో స్వామివారు నిత్యాభిషేక మూర్తిగా దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబిక దేవికి కూడా వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. కాగా, శ్రీకాళహస్తీశ్వరుడి నందిసేవ శుక్రవారం రాత్రి నయనోత్సవంగా సాగింది.శివరాత్రి జాగరణ చేసే భక్తుల కోసం ఆదిమధ్యాంత రహితుడైన సర్వేశ్వరుడు తనకు ఎంతో ప్రీతికరమైన నందిపై దివ్య దర్శనమిచ్చారు. ఊరేగింపును తిలకించేందుకు... జాగరణ చేసి మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడవీధులు కిక్కిరిసిపోయాయి. జ్ఞానప్రసూనాంబా దేవి సింహవాహనాన్ని అధిరోహించి అనుసరించారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానంపై, జ్ఞానప్రసూనాంబదేవి చప్పరంపై అధిరోహించి పురవిహారం చేశారు.

అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

కుమారుడు దుర్మరణం - తండ్రి పరిస్థితి విషమం





సర్వేష్ మృతదేహం - శీనప్ప

రామకుప్పం, మార్చి 8: ఆరిమానిపెంట-వీర్నమల రహదారిలో ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో కుమారుడు అక్కడికకక్కడే మృతి చెందగా, తండ్రి తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు... మండల పరిధి పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగుకు చెందిన శీనప్ప(50), అతడి కుమారుడు సర్వేష్(23) శుక్రవారం సాయంత్రం వీర్నమలలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో ఆరిమానిపెంట-వీర్నమల రహదారి నల్లరాళ్ళచేను క్రాస్ వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో వాహనం నడుపుతున్న సర్వేష్, వెనుక కూర్చున్న శీనప్ప తారురోడ్డుపై పడిపోయారు. సర్వేష్‌కు తలపై తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. శీనప్ప తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 వాహనం ద్వారా శీనప్పను కుప్పం ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, సర్వేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ..మరో ఏడాది

● శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొనసాగింపు

● కొంతమందిని తొలగించి...మరి కొందరికి అవకాశం

శ్రీకాళహస్తి, మార్చి 8: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పాలనా కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి చైర్మన్‌గా అంజూరు శ్రీనివాసులు కొనసాగగా పలువురు సభ్యులను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ప్రధానంగా పట్టణంలో బీసీ, బలిజ కులాల ఓట్లను ఆకర్షించేలా బోర్డులో పలువురు సభ్యులకు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే మధుకు అనుకూలంగా ఉన్న వారందరికీ బోర్డులో తిరిగి స్థానం దక్కగా కొత్తగా ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దివంగత శ్రీరామమూర్తి అన్న కొండుగారి కృష్ణకుమార్‌కు అవకాశం కల్పించారు. అలాగే నాయీ బ్రాహ్మణులకు సంబంధించి ఆవులపాటి శ్రీనివాసులు, అరుణామెడికల్స్ అధినేత సుబ్బరామగుప్తాకు చోటు కల్పించారు. గతంలో ఉన్న ముగ్గురిని తొలగించి ప్రత్యేక ఆహ్వానితులుగా తొమ్మిదిమందిని నియమించారు. వీరిలో గతంలో టీడీపీలో మాజీ కౌన్సిలరుగా ఉన్న కంఠా ఉదయ్‌కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం ఇచ్చారు.ట్రస్ట్‌బోర్డులో ఈసారి అవకాశం వస్తుందని ఆశించిన పలువురికి నిరాశే మిగిలింది. ఆర్థికంగా ఉన్నవారికే బోర్డులో పదవులు ఇవ్వడంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కాగా ఈ మండలికి శివరాత్రి బాగా కలిసొచ్చింది.రెండేళ్ల క్రితం ఫిబ్రవరి 28న అర్ధరాత్రి ముక్కంటి ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పక్కరోజు మార్చి 1న అంజూరు శ్రీనివాసులు చైర్మన్‌గా మండలి ప్రమాణస్వీకారం చేసింది. సరిగ్గా మళ్లీ శుక్రవారం శివరాత్రి రోజున మండలిలో మార్పులు, చేర్పులతో ఏడాది కాలం పొడిగిస్తూ జీవో వెలువడింది. గతంలో లాగే అదే తరహాలో శివరాత్రి రోజున సాయంత్రం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణస్వీకారం జరిగింది.

కలకలం రేపిన సూసైడ్ సెల్ఫీ వీడియో

పోలీసుల అప్రమత్తతతో యువకుడు క్షేమం



నిరంజన్‌ను కుటుంబసభ్యులకు అప్పచెబుతున్న పోలీసులు

వెంకటగిరి, మార్చి 8:తిరుపతి జిల్లా వెంకటగిరి మండల పరిధిలోని వెలుగోండల్లో వున్న కోనమల్లేశ్వర స్వామి కోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు సెల్ఫీ వీడి యో తీసి కుటుంబ సభ్యులకు పంపి కలకలం సృష్టించాడు. వెంకటగిరి పోలీసుల కథనం మేరకు... చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన నిరంజన్ గురువారం కోనమల్లేశ్వరస్వామి కోన అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఓ కొండపై కూర్చొని నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో తీసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియోను వాట్సప్ ద్వారా పంపాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చిత్తూరు పోలీసులు వెంకటగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. వెంకటగిరి ఎస్‌ఐ సుధాకరరెడ్డి హుటాహుటిన సిబ్బందిని వెంటబెట్టుకొని కోన మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే అటవీ మార్గానికి చేరుకొన్నారు. నిద్రమాత్రలు మింగి మత్తులోకి జారుకున్న నిరంజన్‌ను జీపులో ఎక్కించుకుని వెంకటగిరి తీసుకువచ్చారు. నిద్రమాత్రల మోతాదు తక్కువగా వుండడంతో ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవ పడి వచ్చి ఆత్మహత్యకు యత్నించానని ఆ యువకుడు చెప్పాడు. శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

'ఖజానా' శాఖలో సెలవుల్లేవ్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8: మార్చి నెల వచ్చిందంటే ఖజానా ఉద్యోగులకు సెలవుల్లేనట్లే. పండుగ సెలవులైనా, ఆదివారాలైనా విధులకు రావాల్సిందే. ఆర్థిక సంవత్సరానికి చివరి నెల కావడంతో.. మార్చిలో 31 రోజులూ వీరు పనిచేయాల్సిందే. ఇంకా ఉదయం, సాయంత్రం ఒక్కో గంట అదనంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఖజానాతో పాటు చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి ఉపఖజానా శాఖలన్నీ పనిచేస్తున్నాయి. ఆర్థిక పరమైన, ఆర్థికేతర బిల్లులన్నీ మార్చి నెలలోనే పాసవుతుంటాయి. అందుకని ప్రతిరోజూ వచ్చే బిల్లులను వీరు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, పాస్ చేస్తూ సీఎఫ్ఎంఎస్‌కు పంపాల్సి ఉంటుంది. తాజాగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బిల్లులు రావడం ఎక్కువయ్యాయి. వీటిని రాత్రివేళల్లోనూ ఖజానా ఉద్యోగులు వెంటనే పరిశీలించి, పాస్ చేసి, బ్యాంకులకు పంపే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

శ్రీవారి సన్నిధికి దూరమై... మనసు భారమై

తిరుమల ఆలయ మహాద్వారం ముంగిట విలపించిన టీటీడీ ఉద్యోగి





తిరుపతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అది తిరుమల శ్రీవారి ఆలయ ప్రవేశ మార్గం... శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల వేళ... ఆలయం నుంచీ అర్చకుడిలా వున్న ఓ వ్యక్తి విషణ్ణ వదనంతో వెలుపలికి వచ్చారు... మహాద్వారం ముంగిట సాష్టాంగ ప్రమాణం చేశారు... ఆపై లేచి నుంచుని పట్టరాని దుఃఖంతో అక్కడి నుంచీ నిష్క్రమించారు... ధారాపాతంగా కారుతున్న కన్నీటిని ఉత్తరీయంతో తుడుచుకుంటూ సాగిపోతున్న ఆయన్ను చూసి మీడియా ప్రతినిధులు ఏమి జరిగిందంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా చేతులెత్తి నమస్కరించారు. ఏడుస్తూనే వీడియో తీయొద్దని వారిస్తూ ముందుకు సాగిపోయారు. శ్రీవారి ఆలయం నుంచీ విలపిస్తూ నిష్క్రమించిన ఆయన ఎవరా అని ఆరా తీస్తే బదిలీ కారణంగా భారమైన మనసుతో శ్రీవారి సన్నిధికి దూరమైన ఉద్యోగి గురురాజారావు అని తెలిసింది. టీటీడీలో 2002వ సంవత్సరం గురురాజారావు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హోదాలో ఆలయ విధుల్లో చేరారు. ఆపై బొక్కసం క్లర్కుగా తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. టీటీడీలో బొక్కసం సూపరింటెండెంట్ అన్న ఉద్యోగం కీలకమైనదే కాక సంక్లిష్టమైంది కూడా. ఆలయంలో శ్రీవారి బంగారు, వెండి ఆభరణాలన్నీ ఆయన ఆధీనంలోనే, పర్యవేక్షణలోనే వుంటాయి. శ్రీవారి మూల మూర్తికి అలంకరించే ఆభరణాలు, ఉత్సవ మూర్తులకు అలంకరించే నగలు కూడా ఆయనే బొక్కసం నుంచీ ఎంపిక చేసి తీసుకెళ్ళి ప్రధాన అర్చకులకు అప్పగించడం, వాటిని తొలగించాక తిరిగి బొక్కసానికి చేర్చి భద్రపరచడం ఆయన ప్రధాన విధి. ఈ విధుల్లో భాగంగా ఆలయంలో రోజువారీ స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలపైన, పూజలు, ప్రత్యేక పూజా పునస్కారాలమీద ఆయనకు విశేషమైన అనుభవం కూడా వుంది. నిత్యం అర్చకులకు సహకరించే క్రమంలో ఆయనకు రోజువారీ ఆలయంలో శ్రీవారి పూజా కైంకర్యాల గురించి సమగ్ర అవగాహన తెచ్చుకున్నారు. దానికి తోడు డాలర్ శేషాద్రి మరణించే వరకూ ఆయన వెన్నంటి వుండి శ్రీవారి దర్శనార్థమై వచ్చే మఠాధిపతులకు, పీఠాధిపతులకు కూడా ప్రీతిపాత్రుడయ్యారని సమాచారం. ఆలయ వ్యవహారాల్లో ఇటు అర్చకులకు, అటు అధికారులకు నడుమ సంధానకర్తగా వ్యవహరిస్తూ ఆలయ నిర్వహణలో కీలక వ్యక్తిగా మారారు. గత 20 ఏళ్ళలో టీటీడీలో పనిచేసిన ఉన్నతాధికారులందరి వద్దా మన్ననలు పొందారు.విధి నిర్వహణలో ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు కూడా లేవని, వివాద రహితుడిగా పేరు పడ్డారని తెలిసింది. అయితే ఆ క్రమంలో కొంతమంది అధికారుల ఈగో కారణంగా బొక్కసం సూపరింటెండెంట్ విధులకు దూరమైనట్టు తెలిసింది. 2020లో ఆయన్ను బొక్కసం సూపరింటెండెంట్‌గా తప్పించి తిరుమలలోనే వైభవోత్సవ మండపానికి బదిలీ చేశారు. శ్రీవారి బంగారం, వెండి ఆభరణాలు పర్యవేక్షించే బాధ్యతల నుంచీ తప్పించినా కనీసం తిరుమలలోనే విధులు కేటాయించినందుకు సంతోషిస్తూ అక్కడే విధుల్లో కొనసాగారు. అయితే బొక్కసం విధుల నుంచీ తప్పించడంతో సంతృప్తి చెందని కొందరు అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను తాజాగా తిరుమల నుంచే బదిలీ చేయించారని సమాచారం. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని అకౌంట్స్ విభాగానికి బదిలీ చేసినట్టు తెలిసింది. 22 ఏళ్ళుగా తిరుమలలో శ్రీవారి సన్నిధిలో గడిపిన ఆయన బదిలీ కారణంగా తిరుమల వీడాల్సి రావడంతో హతాశులయ్యారని సమాచారం. దీంతో శుక్రవారం విచార వదనంతో ఆలయం వీడిన ఆయన మహాద్వారం ముంగిట శ్రీవారికి ప్రణమిల్లి కన్నీరు కారుస్తూ వైభవోత్సవ మండపం వైపు వెళ్ళిపోవడం చూపరులను కలచివేసింది. శ్రీవారి పట్ల, ఆలయ విధుల పట్ల ఆయనకున్న భక్తిప్రపత్తులు అక్కడున్న వారి మనసులను కదిలించింది.

హరహర మహాదేవ.. శంభో శంకర

●భక్తుల శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు ● భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు ●మహాశివుడికి అభిషేకపూజలు, కల్యాణోత్సవాలు ● పలుచోట్ల అన్నదానాలు



ప్రత్యేకాలంకరణలో గెవిగంగాధరస్వామి సోమేశ్వరస్వామి


మదనపల్లెలోని మంజునాథ స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్నభక్తులు


పీలేరులోని కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు


పీటీఎంలో సంగమేశ్వరుడు


గుర్రంకొండలో సిద్దేశ్వరస్వామి

మదనపల్లె అర్బన్, మార్చి 8:మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి, మదనపల్లె పట్టణంతోపాటు మండల పరిధిలో మహాశివరాత్రి వేడుకలను ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని దేవళంవీధిలో గల సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ఫణేంద్రస్వామి వేకువజాము నుంచే మహన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకంగా పూజలు చేసి అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. నీరుగట్టువారిపల్లెలో నీలకంఠేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త గుడి రామాంజులు ఆధ్వర్యంలో పార్వతీ సమేతం నీలకంఠేశ్వరుడికి గిరిజా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్పపల్లకి వాహనంలో పురవీధులో తమిళనాడు డ్రమ్స్, కోలాటం, చెక్కభజనలతో ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. గెవిగుండులో వెలసిన గెవిగంగాధర స్వామికి రుద్రాభిషేకంతోపాటు విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి రావడంతో ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. ౹ భక్తులకు అన్నదానం చేశారు. వేంపల్లె గ్రామం సమీపంలో వెలసిన ఏకశిలా రూపంలోని మల్లేశ్వరస్వామిని భక్తులు వేలాదిగా తరలివెళ్లి దర్శించుకున్నారు. వరసిద్ధివినాయక స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా విశేషంగా పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయకమిటీ అధ్యక్షుడు సిద్దులు, గౌరవాధ్యక్షుడు కాలా సోముశేఖర్ ఆధ్వర్యంలో వినాయకుడికి అర్చనలు . విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణలతో మారుమ్రోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు మహేష్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, చేశారు. ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని తంబళ్లపల్లె పురవీధుల్లో ఉరేగిం చారు.

పీలేరులో: హరహర మహాదేవ..శంభో శంకరా...అంటూ మహాశివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం పీలేరు మండల వాసులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే పీలేరు పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, శివరామపురంలోని భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయం, అడవిపల్లె మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లను ఆయా ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నగర సంకీర్తన, రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గిరిజా కల్యాణం, రాత్రి లింగోద్భవ సమయంలో స్వామి వారికి 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, కళ్లు మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాల కాంతులతో ఆలయం నూతన శోభను సంతరించుకుంది. శివరామపురంలోని భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో స్వామి వారికి రుద్రనమక, చమక, పురుష సూక్త విధానంలో అర్చన, మహానైవేద్యం నిర్వహించారు. అడవిపల్లె మద్దుండాల మల్లేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఏర్పాటు చేశారు. కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంగీత కచేరి నిర్వహించగా భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో పీలేరు శ్రీ వేంకటేశ్వర నాట్య కళామండలి సభ్యులు వీధి నాటకం, చెక్క భజనలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు వారణాశి మోహన్ రెడ్డి, సభ్యులు సుధాకర, విజయ్ కుమార్, సుమన్, మల్లిఖార్జున, రవి, వంశీ, వినయ్, పోతం శెట్టి రమేశ్, ఆటో బాషా, చాన్‌బాషా, ఉద్యా ఫణీంద్రశర్మ, మయూర్ నాథ శర్మ, వెంకటరమణ నాయునివారు, శిరీష, అబ్బవరం సందీప్ రెడ్డి, అబ్బవరం మల్లిఖార్జున రెడ్డి, ఆంజనేయులు, హరి పాల్గొన్నారు.

గుర్రంకొండలో: మహాశివరాత్రి సందర్భంగా గ్రుంకొండ సిద్దేశ్వరస్వామి ఆలయం, బురుజుపల్లె ఉమామహేశ్వరస్వామి ఆలయం, ప్యారంపల్లె కాశీవిశ్వనాథ ఆలయం, సరిమడుగు మల్లికార్జునస్వామి ఆలయం, సిద్దేశ్వర ఆలయంతోపాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అర్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, విశేష పూజలను చేశారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన, తీర్థప్రసాదాలను అందజేశారు.

కురబలకోటలో: మండలంలోని అంగళ్లు సమీపంలో వెలసిన మల్లయ్యకొండలో శుక్రవారం శివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురబలకోటలోని శివాలయం, ముదివేడు, మల్లయ్యకొండలను చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే కొండపై అన్నదానం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సులు నడిపారు.

ములకలచెరువులో: మండలంలో శుక్రవారం మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ములకలచెరువు సమీపంలోని కనుగొండరాయస్వామి, రామాపురంలోని రామలింగేశ్వరస్వామి, గూడుపల్లె, వేపూరికోట, బురకాయలకోట తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దమండ్యంలో: మండలంలో శుక్రవారం మహాశివరాత్రి పండుగ పురస్కరించుకొని పెద్దమండ్యం, ముసలికుంట, శివపురం, నగరి, పాపేపల్లి, సిద్దవరం శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. శివపార్వతులకు అభిషేకాలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో తంబళ్లపల్లి మల్లయ్య కొండకు కాలినడకన వెళ్లే భక్తులు శివపురం నేలమల్లయ్య స్వామిని దర్శించుకున్నారు. పలు గ్రామాల్లో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపులు చేశారు. శివాలయం వద్ద అన్నదానం కార్యక్రమం జరిగాయి.

నిమ్మనపల్లిలో: మండలంలోని తవళం పంచాయతి అటవీప్రాంతం బాహుదా ఉపనది కుమారస్వామి పశ్చిమ భాగాన వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కాగా స్వయంభు బాలశంకుడి గుడి నిర్మాణం జరుగుతుండడంతో పక్కనే ఉన్న సత్రంలో ఉత్సవ విగ్రహలు ఏర్పాటు చేసి భక్తులకు దర్శభాగ్యం కల్పించారు. అలాగే గార్గేయ శిఖరంలో అఖండ జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. స్వామివారి కల్యాణోత్సవంలో పలువురు భక్తులు పాల్గొన్నట్లు ఈవో మంజుల తెలిపారు. భక్తుల కోసం అన్నదానంతో పాటు గుడి వద్దకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని ఈవో తెలిపారు.

బి.కొత్తకోటలో: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని దిగువ బస్టాండులో ఉన్న శివాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బీరంగి పంచాయతీ శివారులో వెలసిన బండెన్నస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ, చెక్కభజనలు రాత్రికి భక్తుల జాగరణ కోసం సానవులచిన్నమ్మ కథను ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త లక్ష్మీపతి తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలోని పలు శివాలయాలు మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. పీటీఎంలోని పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి, రంగసముద్రం రామలింగేశ్వరస్వామి, టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె వద్ద గల ప్రసన్న పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకం, నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆలయాల్లోని భక్తులు చెక్కల భజనలు, కోలాటలు హరికథలు, అన్నమయ్య సంకీర్తనలతో ఆలయాల్లో రాత్రంతా భక్తులు కాలక్షేపం చేశారు. స్థానిక పీటీఎంలో సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో పళ్ల రసాలతో అభిషేకం చేశారు. టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె వద్ద గల సంగమేశ్వర ఆలయంలో శనివారం 12.30 గంటలకు స్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

రామసముద్రంలో: మండలంలోని పలు శివాలయాలు మహాశివరాత్రి సందర్భంగా భక్తుల శివనామాస్మరణతో మారుమ్రోగాయి. మండల కేంద్రంలోని వాలీశ్వరస్వామి, చంద్రశేఖరస్వామి మూగవాడి గ్రామంలోని పార్వతి సమేత పుండరీశ్వరస్వామి, కొండ శివాలయాలలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలు ఆలయాలలో స్వామివారి కల్యాణోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వాలీశ్వరస్వామి కొండపై ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

టీడీపీ-జనసేన కలయికతో సీఎం జగన్‌కు భయం


ఆరమడక గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

వాల్మీకిపురం, మార్చి 8: టీడీపీ-జనసేన పార్టీల కలయికతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భయం పట్టుకుందని అన్నమయ్య జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం వాల్మీకిపురం మండలంలోని ఆరమడక, దళితవాడ, ప్రాంతాలలో టీడీపీ-జనసేన పార్టీల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇరుపార్టీల సమ్మేళనంతో రూపొందించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటా పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామ గ్రామాన ప్రజలంతా టీడీపీ, జనసేనకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ,టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, నాయకులు రాజేంద్రాచారి, కోసూరి రమేష్, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, డిష్ బ్రదర్స్, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

8 మంది కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

పెద్దతిప్పసముద్రం మార్చి 8 : కోడిపందెం ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4కోడిపుంజులు, 5 ద్విచక్రవాహనాలతో పాటు నగదు స్వాధీనం చేసుక్ను సం ఘటన పీటీఎం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు కర్ణాటక సరిహద్దు గ్రామమైన బూచిపల్లెలో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచా రం అందుకున్న పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు తమ సిబ్బందితో కలసి శుక్రవారం కోడిపందెం ఆడుతున్న శిబిరాలపై దాడులు జరిపి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 11 వేలు నగదుతో పాటు 5 ద్విచక్ర వాహనాలు, 4 కోడిపుంజులను స్వాధీనం చేసుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించిన ట్లు ఎస్ తెలిపారు.

మదనపల్లెలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్



మదనపల్లె అర్బన్, మార్చి 8: రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతి భద్రలకు ఎటాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవచ్చని మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మదనపల్లెలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. అలాగే మదనపల్లె లో పోలీసు 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే అనుమతి తీసవుకోవాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. కార్యక్రమంలో సీఐలు వల్లిబాష, యువరాజు, ఎన్ శేకర్, సద్గురుడు, ఆయా పోలీస్‌స్టేషన్‌ల్లో ఎస్సైలు వెంకటసుబ్బయ్య, వెంకటేస్, రవికుమార్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి


పీలేరు/వాల్మీకిపురం, మార్చి 8: ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు ఏర్పాటు చేయాలన్నా తప్పనిసరి గా పోలీసుల అనుమతులు తీసుకోవాలని పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. పీలేరు లో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ఆదేశాల మేరకు మార్చి నెలాఖరు వరకు పీలేరు పట్టణంలో పోలీసు యాక్టు 30 అమలులో ఉందని, మైకులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాల్లో ప్రచారం వంటి వాటికి ముం దుగా పోలీసు అనుమతి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ పోలీసు నిబంధనల ను పాటించాలని కాదని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని వాల్మీకిపురం సీఐ పులి శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

27 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

మదపనల్లె, మార్చి 8: మదనపల్లె పట్టణంలో పేకాట ఆడుతున్న 27 మందిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.60,150 స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నీరుగట్టువారిపల్లెలోని ఓ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వలిబసు, ఎస్సై హరిహరప్రసాద్ పేకాట స్థావరానికి వెళ్లి, వారందరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

రామసముద్రంలో: రామసముద్రం మండలంలో పేకాట ఆడుతున్న 18మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పైగడ్డ, కాప్పల్లిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి 18మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.69,580 నగదును సీజ్ చేసి వారిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గజ వాహనంపై ఊరేగిన సిద్దేశ్వరుడు


గజవాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వరుడు

కలకడ, ఫిబ్రవరి 8:కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేతా సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా స్వామివారు శుక్రవారం ఉదయం గాండ్లసంఘం ఆధ్వర్యంలో గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూల మాలల తో అలంకరించిన వాహనాన్ని కోలాటాలు, చెక్కభజనలు, బాణసంచలు పేల్చుతూ ఆలయం వద్ద నుంచి కలకడ వరకు ఊరేగించారు. కొత్తగాండ్లపల్లె, గరడప్పగారిపల్లె, దేవళ్లపల్లె, ఎర్రయ్యగారిపల్లె, పెండ్లిమర్రివాండ్లపల్లె, నల్లగుట్టపల్లె, అచెర్లవాండ్లపల్లె తదితర గ్రామాలను వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలను చేశారు. కాగా అంతకుమునుపు ఆలయంలో క్రామాక్షి సమేతా సిద్దేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు విజయసారథి, మహేష్, సుబ్రహ్మణ్యం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి పూజలలో పాల్గొన్నారు.

విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలి

వాల్మీకిపురం, మార్చి 8: ఈ ఏడాది పదోతరగతి పరీక్షలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర ఉర్దూ అకాడెమీ డైరెక్టర్ పేర్కొన్నారు. వాల్మీకిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సందర్భంగా ఆయన తన తండ్రి జిల్లా వక్ఫ్ కమిటీ మాజీ అధ్యక్షుడు అద్దుల్‌జలీల్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్‌లు, స్టేషనరి పంపిణీ చేశారు. టాప్‌టెన్‌లో రాణించిన విద్యార్థికి తనవంతుగా రూ.10,116 బహుమతిగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు మైనార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


ధాత్రి ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ స్వాతిని సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

మదనపల్లె అర్బన్, మార్చి 8: పట్టణంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మహిళా సభ్యురాలు 45 మందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ నీరజా ప్రసాద్ గుప్తా మాట్లాడుతూ మహిళా అభివృద్ధికి, సాధికారతకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. మహిళలు చదువు కుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో తన కాళ్లపై తానే నిలబడుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు శ్రీనాథ్, పి. అమరనాథ్, లక్ష్మీదీపక్, వీవీ కృష్ణారావు, వాసవీక్లబ్ మహిళా సభ్యురాలు, వాసవీ వనితా క్లబ్ సభ్యురాలు పాల్గొన్నారు. అలాగే కోళ్లబైలు పంచాయతీ వెలుగు ప్రత్యేక పాఠశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పుర్కరించుకుని మదనపల్లె స్వచ్ఛంద సంస్థల ప్రముఖులు ధాత్రిఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ స్వాతి, గ్రామజ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్ర, చైతన్య ఆశ్రమం ప్రిన్సిపాల్ కవితారాణిలను వెలుగు సంస్థ కన్వీనర్ బాగ్యలక్ష్మి, వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, మహిళలను సన్మానించారు. స్థానిక బాలాజీ నగర్ పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెకల మధుసూదన, అమరనాథ్, ఈశ్వర్‌నాయక్, ప్రసాద్, ఆనంద్, శారఫత్‌అలీఖాన్, రవీంద్రారెడ్డి, అల్తాఫ్ బాషా పాల్గొన్నారు.

పీలేరులో టీడీపీ ఆధ్వర్యంలో..


మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న తెలుగు మహిళలు

పీలేరు, మార్చి 8: పీలేరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు పురం రెడ్డమ్మ, పీలేరు నియోజకవర్గ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు సాధన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ల మానసపుత్రిక అయిన 'కలలకు రెక్కలు' పథకంతో హద్దులు లేని మహిళాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇటీవల వారు 'కలలకు రెక్కలు' పథకం తెచ్చారన్నారు. రాష్ట్రంలోని ఏ ఆడబిడ్డా ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ కలలతో రాజీపడకుండా వారి లక్ష్యాలను చేరుకునే దిశగా ఆ పథకం అడుగులు వేయిస్తుందన్నారు. ఆ పథకం ద్వారా ఇంటర్ పూర్తి చేసిన ప్రతి ఆడబిడ్డా ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల వారు 'కలలకు రెక్కలు.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.. రిజిస్ట్రేషన్ లింక్ పొందడానికి 92612 92612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసుకుని అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, దేవమ్మ, చందన, రెడ్డిరాణి, హేమావతి, వాణి, షమ, చంద్రలేఖ, అనూరాధ, కాంతమ్మ, విజయ, రక్షిత, వనిత, రజిత, సుశీలమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా టీడీపీ పథకాలు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, మార్చి 8:మహిళా సాధి కారత దిశగా టీడీపీ అధినేత నారా చంద్ర బాబునాయుడు పథకాలు రూపొందించా రని మదనపల్లె టీడీపీ యువనేత దొమ్మ లపాటి యశస్విరాజ్ పేర్కొన్నారు. శుక్రవా రం స్థానిక టీడీపీ కార్యాలయంలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రెక్కలు అనే పథకం కింద జనసేన నేత పవన్‌కళ్యాణ్‌తో కలిసి చంద్రబాబు కొత్త పథకాన్ని రూపొందించారన్నారు. దీనివల్ల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి, రాధమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ శంఖారావంలో తంబళ్లపల్లె నేతలు


నారా లోకేశ్‌ను కలిసిన తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి


ములకలచెరువు, మార్చి 8: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తంబళ్లప ల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి వేదికపై నారా లోకేశ్‌ను కలిసి మాట్లాడారు. జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, నారాయణస్వామిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయకులు వెంకటకమణారెడ్డి, సోమశేఖర్, రంగారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో శంకర్ యాదవ్‌కు న్యాయం చేయాలి


బి.కొత్తకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

బి. కొత్తకోట, మార్చి8: తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌కు న్యాయం చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శంకర్ అనుచరులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం బి.కొత్తకోటలోని జ్యోతిచౌక్‌లో టీడీపీ జెండాలు చేతబట్టి రోడ్డుపై బైఠాయించారు. శంకర్‌యాదవ్‌కు న్యాయం చేయాలి..వైకాపా కోవర్టులను అడ్డుకోవాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పదేళ్లుగా పార్టీకి సేవలు అందించి కష్టకాలంలో పనిచేసిన శంకర్‌యాదవ్‌ను కాదని వైసీపీ కోవర్టు అయిన జయచంద్రారెడ్డికి టికెట్ కేటాయించడం అన్యాయం అని నినదించారు. పార్టీ క్యాడర్ యావత్తూ ముక్తకంఠంతో కోరుతున్న శంకర్‌యాదవ్‌కు టికెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, తెలుగుయువత అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, పెద్దమండ్యం మండల అధ్యక్షులు జిట్టారమణ, నాయకులు కట్టా సురేంద్రనాయుడు, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, కనకంటిప్రసాద్, సుకుమార్, సమీవుల్లా సురేంద్ర, కుడుం రంజిత్, శరత్, చాకనా రాజా పాల్గొన్నారు.

వాల్మీకి,బోయ శంఖారావ సభను జయప్రదం చేయండి


శంఖారావసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

మదనపల్లె అర్బన్, మార్చి 8:వాల్మీకి బోయల ఎస్టీ పునరుద్ధరణే లక్ష్యంగా వాల్మీకి సంఘాలన్నీ రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో నిర్వహిస్తున్న శంఖారావ సభను జయప్రదం చేయా లని సంఘ నాయకులు పిలుపునిచ్చా రు. ఈ నెల 24న మదనపల్లె పట్టణంలో భారీ ఎత్తున వాల్మీకి, బోయ శంఖారావస భను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భం గా స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో శుక్రవారం వాల్మీకి విగ్రహం వద్ద సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ వాల్మీకులను, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఎస్ఐ జేసీఎం ఫంక్షన్ హాల్‌లో చలో మదనపల్లె పేరిట శంఖారా వసభను ఏర్పాటు చేశామని ఈ సభకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు భారీ సంఖ్యలో వాల్మీకులు, బోయలు కదిలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌బాబు, పొదల నరసింహులు, నాగినేని గోవిందు, మేకల విజయ కుమార్, మక్కినేని వేణుగోపాల్, ముత్తరాశి హరికృష్ణ, కృష్ణమూర్తి, తవళం లక్ష్మన్న, శేఖర్, కొత్తవుడుం శంకర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నాపత్రాలు

పెద్దమండ్యం, మార్చి 8: పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌కు శుక్రవారం పదో తరగతి ప్రశ్నాపత్రాలు చేరాయి. రాయచోటి నుంచి వచ్చిన సెట్1 ప్రశ్నాపత్రాలను పోలీసుస్టేషన్‌లో ఉపాధ్యాయులు, పోలీసులు భద్రపరిచారు. పదో తరగతి పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగునున్నట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు. పెద్దమండ్యం, కలిచెర్ల రెండు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుతాయని వారు తెలిపారు.